చినుకు పడితే చిత్తడే..

• కాల్వలను తలపిస్తున్న గ్రామీణ రోడ్లు.. • పలుమార్లు ఫిర్యాదు చేసిన ప్రజలు • పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఉప్పునుంతల : కంసానిపల్లి ప్రధాన రహదారి దుస్థితి

కొల్లాపూర్, జూన్ 7 : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. వర్షం వస్తే సంతోషించే రోజుల నుంచి ఇబ్బందులు పడే పరిస్థితులు కొల్లాపూర్ పరిధిలో నెలకొన్నాయి. మంత్రి జూపల్లి ఇంటికి కూతవేటు దూరంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే.. మారుమూల పల్లెల పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం అవుతోంది. మండల పరిధిలోని అమరగిరి, నార్లాపూర్, ముక్కిడిగుండం, మొలచింతపల్లి, అంజనగిరి గ్రామాలకు వెళ్లే రహదారులు చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్నాయి. గుంతల్లో నీళ్లు నిండడంతో రోడ్డు అర్థం కాక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అమరగిరి చెంచుగూడెంకు కొల్లాపూర్ 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది కానీ.. ప్రయాణానికి దాదాపు గంట సమయం పడుతుందంటే రహదారి ఏ స్థితిలో ఉందో మనం అర్థం చేసుకోవాలి. వానకాలానికి ముందే అమరగిరి, నార్లాపూర్, మొలచింతలపల్లి, ముక్కిడిగుండం, అంజనగిరి, బోడబండతండా గ్రామాల రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేసినా పాలకులు పట్టించుకోలేదు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా కొల్లాపూర్ మండలంలోని చాలా గ్రామాలు తాగు, సాగునీటి కోసం భూములను త్యాగం చేశారు. అంజనగిరి, వడ్డెగుడిసెలు వంటి గ్రామాలు సర్వస్వం కోల్పోయాయి. అయినా.. ఈ గ్రామాలకు వెళ్లే రహదారులు మాత్రం గుంతలమయంగానే ఉండిపోయాయి. చెంచులు అధికంగా నివసించే అమరగిరి రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. సమాజ అభివృద్ధి కోసం సర్వస్వం త్యాగం చేసిన గ్రామాలకు వెళ్లే రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైనా అమరగిరి, నార్లాపూర్, ముక్కిడిగుండం, అంజనగిరి, బోడబండ తండా గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాలు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధ్వానంగా కంసానిపల్లి రహదారి

ఉప్పునుంతల, జూన్ 7 : ఉప్పునుంతల మండలంలోని కంసానిపల్లి గ్రామంలో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. సీఎం సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి నుంచి మండల కేంద్రమైన ఉప్పునుంతలకు వేసిన డబుల్‌రోడ్డు వాహనదారులకు ఎంతగానో సౌలభ్యంగా ఉంది. ఈ మార్గం గుండా నిత్యం హైదరాబాద్‌కు వందలాది వాహనాలు తిరుగుతున్నాయి. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఊరుకు కూత వేటుదూరంలో ఉన్న కంసానిపల్లి గ్రామంలో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రోడ్లు గుంతలు పడి వర్షం నీరు నిల్వ ఉండడంతో ఆ మార్గం గుండా వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామ సమీపంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొల్లాపూర్ : అమరగిరి చెంచు గూడెంకు వెళ్లే రహదారి

నరకానికి దారిగా మారింది..

అమరగిరి చెంచు గూడెం నుంచి కొల్లాపూర్‌కు 8 కిలోమీటర్ల దూరమే ఉంది. కానీ రోడ్డు మొత్తం గుంతలతో ఉండటంతో గంట సమయం పడుతుంది. వానకాలంలో ఎమర్జెన్సీ సమయంలో కొల్లాపూర్‌కు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నాం. ప్రభుత్వం చొరవ చూపి రోడ్డుకు మరమ్మతులు చేస్తే బాగుంటుంది. లేదంటే మేం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- మల్లేశ్, మాజీ ఉప సర్పంచ్, అమరగిరి చెంచుగూడెం

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

• 20 మి.మీటర్ల వర్షపాతం నమోదు • లింగాలలో అత్యధికంగా 86.2 మి.మీ వర్షపాతం

నాగర్‌కర్నూల్, జూన్ 7 : నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండురోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షానికి సగటున 20.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా లింగాల మండలంలో 86.2 మి.మీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా 2.8మి.మీటర్ల వర్షపాతం బిజినేపల్లి మండలంలో నమోదైంది. మృగశిర కార్తీ రావడం వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వానకాలం ప్రారంభంలోనే విస్తారంగా కురవడంతో రైతులు పంట సాగుకు మంచి అదునుగా భావిస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలో 27.0మి.మీ, తాడూరులో 5.0మి.మీ, వెల్దండలో 7.0మి.మీ, తెలకపల్లిలో 30.6మి.మీ, ఉప్పునుంతలలో 14.2 మి.మీ, అచ్చంపేటలో 38.2మి.మీ, అమ్రాబాద్‌లో 52.8మి.మీ, పదరలో 25.4మి.మీ, బల్మూర్‌లో 29.8 మి.మీ, పెద్దకొత్తపల్లిలో 40.0 మి.మీ, కోడేరులో 18.2 మి.మీ, కొల్లాపూర్‌లో 18.2 మి.మీ నమోదు అయింది. అలాగే పెంట్లవెల్లి మండలంలో 11.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

భూ పోరాటాలకు సిద్ధమవ్వాలి

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జాన్‌వెస్లీ

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జాన్‌వెస్లీ

కొల్లాపూర్, జూన్ 7 : పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యలపై భూ పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సింగోటంలో జరుగుతున్న సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాల పట్టాలిస్తామని కాంగ్రెసోళ్లు హామీ ఇచ్చారని.. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకత్వంలో జిల్లాలో అనేక చోట్ల గుడిసెలు వేస్తే.. కేసులు కూడా నమోదు చేశారన్నారు. పేదలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ పేదలకు ఇండ్ల స్థలాలు.. పోడు భూములకు పట్టాలిచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యదర్శి వర్గసభ్యులు ఆంజనేయులు, గీత, దేశానాయక్, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు, గిరిజనసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశోక్, శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బిజినేపల్లి : దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

చారకొండ, జూన్ 7 : పత్తి విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఏవో చిన్నహుస్సేన్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్టాక్ ఎక్కడి నుంచి వచ్చింది వాటి వివరాలు, ఇన్‌వాయిస్‌లు, కంపెనీ సోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే ఫర్టిలైజర్ దుకాణాలను సీజ్ చేసి లైసన్స్‌లు రద్దు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

బిజినేపల్లి, జూన్ 7 : మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు పూర్ణచంద్రారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా గౌతమి, భాగ్యలక్ష్మి, శ్రీసాయి, ధనలక్ష్మి, సంపత్, ఆగ్రోరైతు సేవా కేంద్రం, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, హోంసాయి, యంగ్‌ఫార్మర్ సొసైటీ వంటి దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, క్రిమి సంహారక మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రతిషాపులో ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను పరిశీలించారు. డీలర్లు ఎంఆర్‌పీ ధరకంటే ఎక్కువగా అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏవో నీతి ఉన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, జూన్ 7 : తిమ్మాజిపేట మండలంలోని విత్తనాల, ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల, కంపెనీ, బ్యాచ్ నెంబర్ తదితర వివరాలను పరిశీలించారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు.

వంగూరులో..

వంగూరు, జూన్ 7 : విత్తన దుకాణాల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో తనూజ హెచ్చరించారు. మండలంలోని పోల్కంపల్లి, వంగూరు గ్రామాల్లోని విత్తన దుకాణాలను శుక్రవారం ఏవో తనూజ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో అనిల్ పాల్గొన్నారు.

వెల్దండ మండలంలో..

వెల్దండ, జూన్ 7: ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మంజుల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు చౌదర్‌పల్లి, రాఘాయిపల్లి గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆమె పరిశీలించారు. స్టాక్ బోర్డులో ఎరువుల వివరాలు పొందుపర్చాలన్నారు.

లింగాలలో..

లింగాల, జూన్ 7 : రైతులకు నాణ్యమైన విత్తనాలను సరాఫరా చేయాలని మండల వ్యవసాయాధికారి నాగార్జున్‌రెడ్డి డీలర్లకు సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టరాదని, రైతులు కూడా లూజు విత్తనాలు కాకుండా ప్యాకెట్లో ఉన్న విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

వంగూరులో తనిఖీ చేస్తున్న ఏవో తనూజ

చౌదర్‌పల్లిలో తనిఖీ చేస్తున్న ఏవో మంజుల

చారకొండ : మాట్లాడుతున్న ఏవో చిన్నహుస్సేన్

పాఠశాలలకు ఏకరూప దుస్తులు పంపిణీ

ఉప్పునుంతల : హెచ్‌ఎంలకు దుస్తులు అందజేస్తున్న ఎంఈవో

ఉప్పునుంతల, జూన్ 7 : మండలంలోని పెద్దాపూర్, మొల్గర, కొత్తరాంనగర్, ఫిరట్వాన్‌పల్లి, రాయిచెడ్, గట్టుకాడిపల్లి, పూర్యనాయక్‌తండా, సీబీతండా పాఠశాలల హెచ్‌ఎంలకు శుక్రవారం ఎంఈవో రామారావు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు వీటిని అందజేయాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, ఏపీఎం సైదులు, హెచ్‌ఎంలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, జూన్ 7: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేయనున్న యూనిఫాంలను మహిళా సంఘాల ద్వారా కుట్టిన యూనిఫాంలను శుక్రవారం ఏపీఎం బాలచందర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్, ఎంఈవో శంకర్‌నాయక్‌కు అప్పగించారు. విద్యార్థుల ప్రస్తుతం 1169 యూనిఫాంలు ఒక జత అందజేసి, మిగిత మరో జత యూనిఫాంలు ప్రభుత్వం అందజేసిన వెంటనే పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో సీసీలు విమల, మాధవి, సీఆర్పీ యాదయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల, జూన్ 7 : మండలంలోని జీలుగుపల్లి, రాంపూర్, కేసీ తండా, ఎంసీతండా, మగ్దూంపూర్, మానాజీపేట ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు శుక్రవారం మండల విద్యాధికారి చంద్రుడు ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఏపీఎం బాలస్వామి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

లింగాల, జూన్ 7 : ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న సందర్భంగా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను జెడ్పీ సీఈవో గోపాల్‌నాయక్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు కూడా సకాలం లో అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంవో చంద్రుడు, ఎంపీడీవో ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

సమస్యలు పరిష్కరిస్తాం

బల్మూరు, జూన్ 7 : చెంచులు, గిరిజనులు నివసించే గూడెం, పెంటల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మన్ననూర్ ఐటీడీఏ పీవో రోహిత్ గొపిడి అన్నారు. శుక్రవారం మండలంలోని చెంచుగూడెంలో ఆయన పర్యటించారు. గూడెంలో చెంచులు గిరిజనులు పూర్తిగా 70మందిపైగా ఇల్లు లేకుండా పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్నామని ఆయన దృష్టికి తీసురాగా ప్రభుత్వం నుంచి 40 మందికి ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ, ఆరోగ్య పరంగా సమస్యలు ఉన్నాయని, అదేవిధంగా గూడెంలో విద్యుత్ సమస్యను పరిష్కరించడంతోపాటు స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదివాసులు పీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసులు రాజు, శివ, శ్రీహరి, శ్రీనివాసులు, ముత్యాలు, వీరయ్య, లింగమ్మ, చంద్రమ్మ, భయమ్మ, ముని, సంధ్య, డీపీఎం లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

10న ఇంటర్ ప్రాక్టికల్

అచ్చంపేటటౌన్, జూన్ 7 : ఈనెల 10వ తేదీన ఇంటర్ ఆంగ్లం ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు వర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సంలో పరీక్షకు హాజరుకాని వారికి ఈనెల 10న ఆంగ్లం, 11న ఎన్విరాన్‌మెంట్, 12న ఎథిక్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో తనిఖీ

బల్మూరు, జూన్ 7 : మండలంలోని కొండనాగుల, బల్మూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శుక్రవారం డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్ తనిఖీ చేశారు. పాఠశాలల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

వంగూరు : ఉప్పల్‌పహాడ్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కల్వకుర్తి రూరల్, జూన్ 7 : మౌలిక వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలోనే గ్రామీణ ప్రాంత విద్యార్థులను చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నారని కల్వకుర్తి ఎంఈవో బాసునాయక్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని గ్రామస్తులకు అవగాహన కల్పించి తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్, జూన్ 7 : బడి బయటి పిల్లలు పాఠశాలల్లో ఉండాలని కొల్లాపూర్‌లోని గాంధీ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని సోమశిలలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు కృష్ణ, రామ్మూర్తి, భాస్కర్, శ్రీకాంత్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సోమశిలలో జెడ్పీ హైస్కూల్ లేకపోవడంతో చాలామంది విద్యార్థులు డ్రాప్‌ఔట్ అవుతున్నారని.. వారంతా ప్రభుత్వ బడుల్లో చేరేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతున్నదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

28 మంది విద్యార్థులు చేరిక

తిమ్మాజిపేట, జూన్ 7 : తిమ్మాజిపేట మండలంలో జరుగుతున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 28 మంది విద్యార్థులు పాఠశాలలో చేరినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంగూరులో..

వంగూరు, జూన్ 7 : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఉప్పల్‌పహాడ్, వెంకటాపూర్, నిజాంబాద్ తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ : విద్యార్థులతో గాంధీ పాఠశాల ఉపాధ్యాయులు

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, జూన్ 7 : మండలంలోని జటప్రోల్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి బయటి పిల్లలను బడుల్లో చేర్పిస్తామని ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. జటప్రోల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలే దారి చూపుతాయన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు సీవీ రావు, శోభ, అర్జున్‌గౌడ్, నరసింహ, శ్రీధర్, నాగరాజు, వసంత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటరూరల్, జూన్ 7 : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సింగారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమణ తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం సింగారంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆరుగురి విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా ఐనోల్ కస్టర్‌లోని దుబ్బతండా, కొర్రతండా, చేదురుబావితండాల్లో కూడా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు గోపాల్‌నాయక్, రాజు, శ్రీకాంత్, మహేశ్, శ్రీకాంత్, స్ట్రాంగ్ టీచర్ రఘునాథ్‌రెడ్డి, సీఆర్‌పీ హన్మంతు పాల్గొన్నారు.

దవాఖానలో వసతులు కల్పించాలి

కల్వకుర్తి రూరల్, జూన్ 7 : తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం ఆయన నివాసంలో కల్వకుర్తి యువజన విభాగం అధ్యక్షుడు అనిల్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశాడు. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేయాలని ఆయన మంత్రిని కోరారు. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి నిత్యం పలు గ్రామాల నుంచి రోగులు, గర్భిణులు వస్తుంటారని దవాఖానలో మరింత వైద్య సేవలు కల్పించేందుకు వసతులు కల్పించాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలి

• ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్

చారకొండ, జూన్ 7: పంచాయతీ ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపల్లిలో నర్సరీ, పంచాయతీ రికార్డులు, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో భాగంగా జాతీయ రహదారి ఇరువైపులా నాట్టాలని, నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. పాఠశాల ప్రారంభంలోపు మౌలిక వసతులు కల్పించాలన్నారు. సీజినల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేయాలని చెప్పారు. ఉపాధిహామీ ఏడు రికార్డులతో పాటు పంచాయతీ రికార్డులు విధిగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌కు సూచించారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో లక్ష్మణ్‌సింగ్

అచ్చంపేటరూరల్, జూన్ 7 : వానకాలం సాగు చేసే పంటలపై శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. లింగోటంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఈవో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్ రైతులు లైసెన్స్ కలిగిన వ్యాపారుల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా రైతులు పంట వ్యర్థాలకు నిప్పుపెట్టకుండా దమ్ము చేసేటప్పుడు కలియదున్నితే పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుందని, విత్తనాలు కూడా శుద్ధి చేసి నాటుకోవాలని చెప్పారు.

అథ్లెటిక్స్‌లో నల్లమల విద్యార్థికి సిల్వర్ మెడల్

విద్యార్థిని సన్మానించిన స్కూల్ యాజమాన్యం

అచ్చంపేటటౌన్, జూన్ 7 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అచ్చంపేట ఎంఎస్ఎన్ స్కూల్‌లో చదువుతున్న నల్లమల విద్యార్థి సిల్వర్ మెడల్ సాధించడం నల్లమల ప్రాంతానికి గర్వకారణమని పాఠశాల చైర్మన్ సీఎం రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 5,6 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎంఎస్ఎన్ స్కూల్ విద్యార్థి ఆర్ శివరామకృష్ణ అండర్-10 విభాగంలో 80మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించి రికార్డు నెలకొల్పాడని తెలిపారు. అనంతరం విద్యార్థిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మన్సూర్‌ఖాన్, పీఈటీలు రాజేందర్, సైదులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కోడేరు, జూన్ 7 : తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కోడేరులో చోటుచేసుకున్నది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం మండలకేంద్రానికి చెందిన నల్లవెల్లి స్వామి(40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో రోజూ మద్యం తాగి కుటుంబీకులు, చుట్టుపక్కల వారితో తరచూ గొడవ పడేవాడు. కాగా మనస్తాపానికి గురైన స్వామి భార్య మూడురోజుల కిందట తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో స్వామి శుక్రవారం ఉదయం మద్యం తాగి ఇంట్లోని ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొల్లాపూర్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీ : మేకల కాపరి మృతి

బల్మూరు, జూన్